మంచినీరు చాలినంత లేదు. బియ్యం చాలవు, ఉప్పు వుంటే వుందిగాని పప్పులు లేవు, వంటచెరకు చాలదు, ప్రత్తి చాలదు, చింతపండు చాలదు—ఇలాటి రాష్ట్రం స్వతంత్ర దేశంగా వుండగలదంటే, అది నమ్మవలసినమాట కాదు. అయితే యీ ఆందోళన ఇప్పటికే చాలా లాభాలను చేకూర్చి పెట్టింది; ఇలాటి ఆందోళనను కేంద్రప్రభుత్వమే ఎంతమాత్రమూ లెక్క చెయ్యనక్కర లేదు. అలాటిది ఇరుగుపొరుగు రాష్ట్రాలవారికి దీని ప్రమేయమే వుండకూడదు.


మన మనుగడకోసం, మన రాష్ట్రంలో నీటివనరుల ప్రాజెక్టులకోసం, పరిశ్రమల అభివృద్ధికోసం, మనమే ఎంతో ఆందోళన జరిపి. కేంద్ర ప్రభుత్వ నాయకులు కొంచెంసేపయినా మన రాష్ట్రంమీద దృష్టివుంచే అవసరం మనకు వుండగా, ఇరుగుపొరుగు రాష్ట్రాలలోని స్వప్రయోజనపరుల ఆందోళనలను గురించి ఆలోచించి, వారిని దువ్వడానికి ప్రయత్నించడం మనకు అనవసరం.

తమిళనాడు సమగ్ర అభివృద్ధికి, ఆంధ్రప్రదేశ్‌లోని నదీజలాల వినియోగంతోసహా, 1100 కోట్ల రూపాయలు వెచ్చించి పెద్ద పెద్ద పరిశ్రమలను ప్రాజెక్టులను, అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించాలని ఇటీవల తమిళప్రముఖుల కమిటీ ఒకటి సూచించింది. ఇకముందు కేంద్ర ప్రభుత్వం మీద వత్తిడి తెచ్చి, తమిళదేశంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎక్కువగా సహాయం పొందడానికి ఇది ఒక నాంది.

ఈ విధంగా తమిళులు తమ పురోగతికి యత్నాలు చేస్తుంటే, మన సంగతి మనం ఆలోచించడంకూడా లేదు. మనకు యీనాడు గల పెద్ద సంపద, మన నదులు: ఆ నదులజలాలను పూర్తిగా వినియోగించడానికి అవసరమైన పథకాలను తయారు చెయ్యడానికి ఒక కమిటీని నియమించడం, వెంటనే మన మంత్రిమండలి చెయ్యవలసిన పని. ఈ విషయంలో మన ఏమరుపాటు, జాప్యం మనకు నష్టాన్ని కలిగిస్తాయి. అంతవరకు మనం వూరుకోవలసిందేనా: లేక మంత్రిమండలి వెంటనే సమావేశమై తగిన నిర్ణయానికి వస్తారా?

# అరణ్యారోదన

అంజయ



ఒక్క నిద్రపోయి లేచాను. పాడు నల్లులు పడుకోనిస్తేగదా? ఎన్ని పుష్కరాలై ఆ కొయ్యబల్ల నక్కడ ప్రతిష్ఠించారో, ఎందరు మహానుభావు లా బల్లను పట్టుపాన్పుగా చేసుకు పవ్వళించారో; నల్లులున్నాయనుకోడం నాదేబుద్ధితక్కువ.

నెత్తిపై స్టేషను లాంతరు నిస్సహాయుడైన సైనికుడిలా తన విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చుతున్నది. అధికారులు చూస్తే కొరత వేస్తారేమో నన్నట్లు దొంగనిద్రపోతూ మెలకువ నటిస్తున్నది.

లై మెంతయిందో—మద్రాసు మెయిలయినా పోయిందో లేదో—ఇంకెంతకాల మీ శవజాగరణ చేయాలో తెలుసుకుందా మని మెల్లగా నడచి స్టేషను మాష్టరు గదివైపు వెళ్లాను. ఆయనగారు కిటికీలతోసహా మూసి, దీప మార్పేసి మరీ పడుకున్నాడు. రైల్వే పోర్టరయినా దొరుకుతాడేమో నను కుంటే, అదీ లాభం లేకపోయింది.

అవును మరి. ఎంత వుద్యోగమైనా ఇంత చలిలో పెళ్లాన్ని వదలి వుండట మంటే ఆ పురూరవుడికైనా కష్టసాధ్యం కావచ్చు!

ప్రాణంలేని పార్సిళ్లు చలి కాగలేనట్లు ఒకదా న్నొకటి ఒరుచుకుని పడు కున్నాయి. ముడుచుకుని మూడంకె వేసి నట్లున్న చెట్టు. ప్రక్కనున్న మరో చెట్టుకొమ్మపై చేయి వేసి దగ్గరకు రమ్మని రాపాడుతున్నది.

కాలు సారించి వేడికోసం కొంచెం తిరిగి వద్దా మన్నా ఊరికీ స్టేషనుకూ మైలున్నర దూర ముంటుంది. ఈ అపరాహ్ణపు టడవిలో స్టేష నెందుకు కట్టారో ఆ రైల్వే అధికారులకే తెలియాలి!

చేసేదిలేక సిగరెట్టు వెలిగించుకుని తిరిగీకొయ్యబల్లపై శరీరాన్ని జేరవేశాను.

...ఒక్క క్షణంలో నాకు బండి తప్పి పోయింది. నిలబడితే చలి చంపేస్తుం దన్నంత భయంతో పరుగెత్తిపోయింది బండి. లేకుంటే ఈ పాటికి సగందూరం పోయివుండేవాడిని....

ఎవరు! ఎవరో మనిషి? నిండా ముసుకు కప్పుకుని—నా వైపే నడచి వస్తున్నది. సర్దుకుని కూర్చున్నాను. ఫరవాలేదు. మనిషి. అందులో మగ మనిషి. దగ్గరకంటూ వచ్చాడు.

స్టేషను దీపపు సన్నటి వెలుగు అతని ముసుగుపైని, ముందుకు వచ్చిన అతని గుబురు మీసాలపై మాత్రమే పడుతున్నది. ముఖ మంత స్పష్టంగా గోచరించడంలేదు. అతగాడు నన్నొక సారి పరిశీలనగా చూచి 'మీకు సదు వొచ్చునా?' అన్నాడు.

అసందర్భంగా వున్న ఈ ప్రశ్న నాకు కొంత ఆశ్చర్యాన్నీ, నవ్వునూ కలిగించింది.

'వచ్చు; కూర్చో' మెల్లగా నవ్వి 'అయినా ఇప్పుడు చదు వేమిటి?' అన్నాను.

జారిన ముసుగును తిరిగి తలమీదికి లాక్కుంటూ అతను క్రింద కూర్చు న్నాడు. ప్రభుత్వమువారి బల్లపై ప్రతి ఒక్కరికీ గల హక్కును ప్రస్తావించినా వినక, బీడీ వుంటే ఒకటి దయసేయ మన్నాడు. ఉభయులం పొగ పీల్చుతూ శరీరాన్ని కొంతలో కొంత వేడి చేసు కున్నాము. అంతకూ చలి ఆగక, నేను మాత్రం ముడుచుకునే మీగాళ్లు పట్టుకు కూర్చున్నాను.

'నిజంగా మీకు సదు వొచ్చుగా? అంతంతమాత్రం వానాకాలపు నాయా ళ్లకి దీన్ని సదవనేరాదు. అబ్బో! ఏం రాతనుకున్నారు? జిలుగు రాతంట; తెలుసా?' అంటూ చంకలోంచి ఒక చిన్నసైజు పెట్టెను గాజుసామాను దించినట్లు భద్రంగా దించాడు.

ముమ్మాటు కండ్ల కద్దుకుని నేలకు తగులనివ్వకుండా ఒళ్ళో పెట్టుకున్నాడు.



పెట్టె చిన్నదైనా తాళం దొడ్డది. మొల తడివి చూచుకొని, తాడు గట్టిన పెద్ద తాళంచెవితో గడియారపు పనివాడివలె అతి సున్నితంగా, జాగ్రత్తగా పెట్టె తెరిచాడు.

అత డలా పెట్టె తెరుస్తుంటే నా కేవేవో కథలు గుర్తుకొచ్చాయి. అల్లా వుద్దీన్ మాయాదీపం, బాగ్దాద్ దొంగ కథలలో గనుక మంత్రశక్తివల్ల— లేదు. మనవాడు అతిసామాన్యుడు. అంతటి ఘనకార్యాలు సాధించే సాహ సుడు కాడు.

ఒక కాగితాన్ని బయటికి తీసి, మళ్లీ ముమ్మాటు కళ్ల కద్దుకుని నన్ను దోసిలి పట్టమన్నాడు. దేవీప్రసాద మని అందు కున్నాను. ఇంతవర కే చరిత్రకారుడు కనుగొనిన పరమసత్య మేదో యిందు గుప్తమై యున్న దనిపించింది. ఆతుర తతో చూచాను. కారుక్రింద పడి కొన ప్రాణంతో బయటపడ్డ మనిషికి గనుక కట్లు కట్టినట్లు అన్నీ అతుకులే; పాపం ఎన్నిసార్లు అతికాడో ఆ పల్చని కాగి తం పొనుఅట్ట రూపం దాల్చింది.

గుడ్డి వెలుతురులో అక్షరాలు కని పించడంలేదు. అవును; ఏ ప్రాకృత పాళీ భాషలో గుర్తుపట్టడం కష్టంగదా!

'లాంతరి కిందకి దించమంటారా? ఎవురూ లేరులే; మళ్లీపెట్టేద్దాం' అన్నా డతను నా శ్రమను గుర్తించినవాడై.

నవ్వి నేనే బల్లపై కెక్కాను.



"ఏమండీ డబ్బు మాట్లాడుతుం దంటారు, నిజమేనా?"
"అలా అంటారు మరి...."
"ఐతే మీరు ఆఫీసు కెళ్ళేటప్పుడు నా దగ్గర కొంత డబ్బు వదిలిపొండి; ఏమైనా మాట్లాడుతూ కూర్చోవచ్చు. ఏంతోచటంలేదు ఒంటరిగాకూర్చుంటే."

'పడకుండా బద్దరంగా పట్టుకుం టాలే. నువ్వు సదువు' అన్నాడు.

ఆ కాగితఫలకం వ్రాసి ఎంత కాల మయిందో — అందులో పెన్సిలు గీత లనుకుంటా — లిపిని గుర్తించేందు కేనా వీలులేకుండా మాసిపోయింది. శాయ శక్తులా ప్రయత్నించాను. అబ్బే! సోడా బుడ్డి అద్దాలు వేసుకున్నా అక్షరాలు అందేట్టులేవు.

అయినా కొయ్యచెక్కపై ఎందాక నిలబడగలను? అప్పటికే కాళ్ళు ఒరు సుకుపోయి తీపులు తీస్తున్నాయి.

'లాభంలేదు. ఎలా చదవడం ?'

'బాబ్బాబు ! దన్నంపెడతా. మైలు న్నరదూరంనుం చొచ్చా.'

నా కీసారి నిజంగా ఆశ్చర్యం వేసింది.

'ఇప్పుడే చదవాల్సిన అవసర మేమిటి ? ఇంతరాత్రిలో చీకటిలో పడి రాకపోతే రేపు ఉదయం ఎవరిచేతనైనా చదివించుకోవచ్చునుగదా' అన్నాను.

'ఈ రాతిరి నిదరడితేగద బాబూ ! అది యినకపోతే నాకు నిదరట్టదు.'

అక్షరాలను గుర్తుపట్టడానికి గట్టిగా ప్రయత్నించాను. బల్లపై మునివ్రేళ్ళమీద నిలబడి లాంతరు కెంత దగ్గరగా వెళ్ళ గలిగితే అంతదగ్గరకు జరిగాను. అతి ప్రయాసమీద ఒకఅర్ధగంటకు రెండంటే రెండు అక్షరాలు దొరికాయి.

గట్టిగా ఊపిరితీసుకుని 'గాజు' అని చదివాను.

'అగ్గదీ. అట్ట సదవాల బాబూ! నీకు కానరాపోతే మద్దెమద్దెలో నేను అందిత్తా వుంట. అట్టగే సదువుకెల్తుండుబాబూ !'

నాఆశ్చర్యం ఆకాశమెత్తున పెరిగింది.

"సదవండిబాబూ ! 'గా-జు-ల-య-ల్ల-మ-ం-ద-కి'సదవండీ యింక" అన్నాడు.

ఆశ్చర్యం కోపానికి మారి 'ఏం, తమాషా చేద్దా మనుకుంటున్నావా ? వీ డెవడో పిచ్చముండాకొడుకు ఒంటరిగా దొరికా డనుకుంటున్నావా ?' అని విది లించుకుంటూ నేను దిగాను.

అతను మారుమాటాడలేదు. చుట్టూ పరచుకున్న చీకటి గుడ్డిదీపపు కాంతిని దిగమ్రింగి నెమరు వేస్తున్నది. అప్పుడే లేచిందేమో ఒక కుక్క తోకాడించు కుంటూ వచ్చి మా యిద్దరి మధ్యనుండి పోయింది.

సిగరెట్టు కాలుద్దా మని అగ్గిపుల్ల వెలిగించాను.

అతను ఏడుస్తున్నాడు! నల్లని చీక టిలో నిశ్శబ్దంగా ఏడుస్తున్నాడు!

బల్ల దిగి అతని కెదురుగా కూర్చుని గడ్డం పట్టుకు తల పైకెత్తాను. అబ్బ! వికారం. ఆ సన్నని కాంతిలోనే అతని ముఖం అత్యంత వికార మనిపించింది. పిల్లలు అడ్డదిడ్డంగా బొగ్గుతో గీసిన బొమ్మలా వుంది అతని ముఖం. పైగా పెద్దముత్తయిదువులు పెట్టుకునే కుంకుమ బొట్టంతటి స్ఫోటకంగుంటలు.

అసహ్యాన్ని దిగమ్రింగుకుని అన్నాను; ఎందు కేడుస్తున్నా ?

అన్నానో : లేదో గొల్లు మని ఏడ్చే శాడు. మింటికి రంధ్రం పడిన విధాన అతని కంటికి రంధ్రం పడింది.

మాదగ్గరగా వున్న చెట్టుపైని పిట్టలు ఉలికిపడి మేల్కొని రెక్కలు తపతప లాడించుకుంటూ భయంతో ఎగిరి పోయాయి.

'నీ వలా ఏడిస్తే అసలు చదవను. నాకుగూడా పూరికే ఏడుపొస్తుంది.'



నన్ను కౌగలించుకుని నా తలను ముద్దు పెట్టుకుంటున్నాడు.

హఠాత్తుగా తలపైని ఎవరో బలంగా కొట్టినట్లు నన్ను వదలి 'తప్పు తప్పు. తెలియకసేశాను. సెంపలేసుకుంటున్నా' నని ఎడంగా జరిగి వెక్కివెక్కి ఏడు స్తున్నాడు.

నా కేమీ అర్థం కావడంలేదు. ఎందు కలా ఏడుస్తాడు? ఎందు కలా భయంతో వణికిపోతాడు ?

చలిగాలి చంకల్లోకి జొరబడింది.

సిగరెట్టు కాల్చమన్నాను. అగ్గిపుల్ల వెలిగించి అతని సిగరెట్టును ముట్టిం చాను. చుట్టకాల్చినట్లు కాల్చుతూ కళ్ళు తుడుచుకుని కూర్చున్నాడు.

ఒక సిగరెట్టు కుత్తుకలోనికెల్లా కాలి పోయింది. రెండవ సిగరెట్టు తీసి వెలిగించాను.

'బాబూ ! నాకత యింటారా ?'

వేడి చేసుకుంటూ చెప్పమని మరో సిగరెట్టు అందించాను.

'నాపేరు గాజులయల్లమంద. పుటక తోనే యిట్ట కురూపిగా పుట్టాను. నను గన్న తల్లయినా నన్ను దగ్గరకి తీసి ముద్దు పెట్టుకున్నట్టు యెరగను. అంత పాపిష్టిబతుకు నాది.... అయితే పనిలో నన్ను వంచే నాయాలు లేదు. సీరె నేసినా నంటే ఏ ఆడది కట్టినా రంబ కావల సిందే.'



"వాణ్ణి కొట్టినందుకు నీకు పాతిక రూపాయలు జుల్మానా వేశాను."

"యాభై వేయించండి. ఇంకోమాటు వాణ్ణి కొట్ట వలసి ఉంది."

ఒళ్లంతా కళ్లుచేసుకుని వింటున్నాయి సిగరెట్లు.

'ఎంతమందికి ఎన్ని సీరె లిచ్చానో సెప్పుకుంటే సిగ్గేస్తది. సీరెలు లాబం లేదని కొంతకాలం సవరా లల్లిసూశాను. బవు అందంగా బారెడు పొడు గుండే సవరా లిచ్చాను. ఉహుఁ లాబం లేక పోయింది.'

కోపంతో సిగరెట్ల కండ్లు చింతనిప్పు లైనాయి.

'గాజుల మలార మేసుకుని ఊళ్లన్నీ తిరిగాను. రకరకాల గాజులు, రంగు రంగుల గాజులు, పూలగాజులు, మేలు గాజులు ఎన్ని యిచ్చినా ఒక్క ఆడదీ

నన్ను బ్రమసలేదు. అడదాని ప్రేమ లేకండా మగవా డెంతకాలం బతగ్గలడు సెప్పండి!' పెద్దగా అఢుస్తున్నా డతను. కాదు ఏడుస్తున్నాడు.

'ఎవురేనా నన్ను బ్రమసం డని పెద్దగా అరిశాను. తిట్టి మొట్టికాయ లేశారు. నా జుట్టు సగం వూడిపోయింది మొట్టికాయల మూలానే. నిజెం, పెమా ణం జేసి సెవుతున్నా; నిజెం బాబూ!'

మాట్టాడలేకపోయాడు; గొంతులోని ఏడ్పు గురగురమంటున్నది. సిగరెట్టు పారేసి తిరిగి అందుకున్నాడు.

'నే నా సీకట్లో వుండగా కవలమ్మ నాకు సీటీ రాసింది. నాకు సదువొచ్చు ననుకుని ప్రేమసీటీ రాసింది దొర గారూ! పిచ్చిముండ! నన్ను బ్రమి సింది. నన్ను బ్రమిసే ఈ సీటీ అంపింది దొరగోరూ! నిజెం,అదే యిది. ఇదే మిమ్మల్ని సదవమంటుండా. తొందరగా సదవరూ?'

వణికిపోతున్న అతని చేతివ్రేళ్ళ నా కాళ్లకు చుట్టుకుని గజగజలాడి పోతున్నాయి.

'చదువుతా. తప్పక చదువుతాను' అని అతని రెండు చేతులనూ నా చేతి లోనికి తీసుకున్నాను.

గణగణ మని గంట మ్రోగింది.

రైల్వేపోర్టరు వచ్చి చేలాంతరుతో మా ముఖాలు చూచాడు.

'ఇక్కడ జేరావు నాయనా! ఊళ్ళో యెవరూ చదివేవాళ్లు దొరకలా? వెళ్ళు కునిష్టివెధవా! పొద్దున్నేలేచి నీమొహం చూడాలిసొచ్చింది' అంటూ చేలాంత రుతో తలపైని ఒక్కపోటు పొడిచాడు.

అడుగుల చప్పుడు వినిపించేంత వరకు అతని ఏడ్పు వినిపిస్తూనేవుంది.

'కమలమ్మ రాయలేదు; విమలమ్మ రాయలేదు దొరగారూ! ఎవరో బడి కుర్రాడిచేత వాడే రాయించుకుని ప్రతి రోజూ యిలా ఎవరిచేతనో చదివించు కుంటుంటాడు. అంతే, బందొస్తోంది; టిక్కెట్టు తెచ్చుకోండి దొరగారూ!'

బండిలో కూర్చున్నా, ఇంటికి వచ్చినా, పడుకున్నా, పనిచేస్తున్నా ఆడ దాని ప్రేమ లేకుండా మగవా డెంతకాలం బతగ్గలడు సెప్పండి' అన్న గాజుల యల్లమంద హృదయ విదారకమైన రోదన వినిపిస్తూనే వుంది.





# పనిలేని మంగలి

"సిగ్గు" యొక్క సాంఘిక చరిత్ర రాయటం నేను పెట్టుకున్న జీవితాశ యంలో ఒకటి. దీన్నిగురించి భారీ ఎత్తున రిసెర్చి జరిపి, డేటా పోగు చెయ్యవలిసి ఉంది. ఇది పూర్తి కావటానికి చాలా దశాబ్దాలు పట్టవచ్చు. ప్రస్తుతం నేను సేకరించిన విషయాలు డాక్టరేట్ కు చాలవు. అయినా ఇవి కాపీ రైట్ అనీ, వీటిలో అంతాగాని, కొంత గాని సంగ్రహించినవాళ్ళు తగు చర్యకు గురి అవుతారనీ తెలుసుకునేది.

సిగ్గూ, బిడియమూ, మానమూ, అభి మానమూ మొదలుగాగలవి ఒకే కుటుం బానికి చెందిన భావాలు. ఇవి వ్యక్తిపర మైనవి. ఇవి వ్యక్తిని సమూహంనుంచి వేరు చేస్తాయి. వ్యక్తి సమూహం సమక్షంలో సిగ్గుపడుతుంది; సమూహం ఒక వ్యక్తి సమక్షంలో సిగ్గుపడదు. దీన్ని కొందరు మనస్తత్వవేత్తలు ఆమోదించకుండా ఉంటున్నారు. వ్యక్తి అయిన భర్త సమక్షంలో వ్యక్తిఅయిన భార్య—కనీసం కాపరానికివచ్చిన కొద్ది రోజుల పాటైనా—సిగ్గు పడడంలేదా అంటారు! అలాగే, ఒకొక్కొక్కసారి క్లాసులో పిల్లలందరూ తమ ఉపాధ్యా యుడి సమక్షంలో సిగ్గుపడటం జరగటం లేదా అంటారు!

ఇది తెలివైన వాదన కాదు. భార్య భర్తనుచూసి సిగ్గుపడ్డంత కాలమూ భర్త ఆమెపాలిటికి సమూహాన్నే స్ఫురింప జేస్తాడు; అతడు ఒంటిగాడని తెలియ గానే సిగ్గు పోతుంది. పిల్లలు ఉపాధ్యా యుడి ఎదట సిగ్గుపడటమనే అస్వాభా విక విషయం ఒకవేళ సంభవించిందే అనుకున్నా, ఆ సమయంలో పంతులు సమూహాంతరపున నిలబడతాడు. విద్యా ర్థులు తమ వ్యక్తిత్వాన్ని కోల్పోతారు.

ఈ విధంగా వ్యక్తులు సమూహాలకు ప్రతినిధులుగా నిలబడటమూ,సమూహం కాస్తా వ్యక్తుల సముదాయం అయి పోవటమూ సాధ్యమా అని అమాయ కులు అనుకొనవచ్చు. కాని ఇది నిత్యమూ జరిగేదే. అందుకే ఒక్క నియంత రంకెవేస్తే కొన్ని లక్షల జనం గడగడ లాడిపోతారు. "నేను ఒక్కణ్ణేగదా ఇంతమందిని ఏంచెయ్య గలను?" అని నియంత అయినవాడు అనుకోడు; అటువంటి అనుమానం టాల్‌స్టాయి కథలలో "ఇవాన్" కు మాత్రమే కలుగుతుంది! రాజకీయ నాయకులూ, సినిమాస్టార్లూ, ఉపన్యాస కులూ, మొదలైనవాళ్ల చుట్టూ మూకలు చేరినప్పుడల్లా వ్యక్తులూ, సమూహాలూ తారుమారు కావటం మనం చూడవచ్చు.